క్లుప్తంగా

మసీదు ప్రారంభం



ఫిరంగిపురం: ఎస్టీ కాలనీలో ఆదివారం మస్జిద్-ఏ-హుద్‌ను మత గురువులు ప్రారంభించారు. గతంలో ఉన్న కొద్దిపాటి పాత భవనం స్థానంలో ముస్లిం దాతల సహకారంతో సుమారు రూ.40 లక్షలతో దీనిని నిర్మించారు. హఫీజ్ అబ్దుల్ సుభానీ, మౌలానా షరీఫ్‌ల ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

కొండ మల్లికార్జున స్వామి గ్రామోత్సవం



తాడికొండ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తాడికొండ కొండపై వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత కొండ మల్లికార్జున స్వామికి ఆదివారం శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై ఉంచి ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అపకారికైనా ఉపకారం చేయాలి



ఫిరంగిపురం: ప్రతి వ్యక్తి తన జీవితంలో అపకారం చేసిన వారికీ ఉపకారం చేయాలని క్రీస్తు బోధించాడని సహాయ విచారణ గురువు చొప్పర కిషోర్‌బాబు చెప్పారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో ఆదివారం ప్రత్యేక దివ్యపూజాబలి కార్యక్రమం నిర్వహించారు. కిషోర్‌బాబు వాక్యోపదేశం చేశారు. క్రీస్తు బోధనలు అనుసరణీయమని చెప్పారు.

హోరేబు ప్రార్థన మందిరంలో ముగిసిన వేడుకలు



తెనాలి టౌన్: చెంచుపేట ఇందిరాకాలనీలోని హోరేబు ప్రార్థనా మందిరంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆరో వార్షిక వేడుకలు ఆదివారంతో ముగిశాయి. సంఘ కాపరి బ్రదర్ భక్తసింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ప్రత్యేక వర్తమానికులు బ్రదర్ ఇమ్మానియేలు జమరాజ్ (విజయవాడ) బ్రదర్ ఫిలిప్‌లు (జమ్మలమడుగు) వాక్య సందేశం అందజేశారు. ప్రార్థనల్లో పాల్గొన్న వారికి ప్రేమ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వాసులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్వధార్ హోంలో అన్నదానం



తెనాలి: దుగ్గిరాల మండలం మంచికలపూడి గ్రామానికి చెందిన వీరంకి వెంకట పద్మావతి 19వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆమె కుమార్తెలు వీరంకి రమ్య-శ్రీకాంత్ దంపతులు, వీరంకి కావ్య స్థానిక జీఎంజే స్వధార్ హోంలోని ఆశ్రితులకు అన్నదానం చేశారు. పట్టణ గాంధీచౌక్‌లోని కొల్లావారి వీధిలో గల శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. రెండుపోట్ల స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట పద్మావతి భర్త, సీనియర్ ఫొటోగ్రాఫర్ వీరంకి రాజశేఖర్, ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థుల సేవలు అభినందనీయం

మంగళగిరి : ఈమని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్ విద్యార్థుల సేవలు అభినందనీయమని స్కౌట్ జిల్లా కమిషనర్ పి.శ్రీనివాసరావు కొనియాడారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులపాటు స్కౌట్ విద్యార్థులు భక్తులకు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సత్కరించినట్లు వివరించారు.

పర్యాటక నగరి.. మంగళగిరి



కొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్‌తో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు

- టెంపుల్ హిల్ ఎకోపార్క్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే
- నడక మార్గం ద్వారా గండాలయ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు

మంగళగిరి: టెంపుల్ హిల్ ఎకో పార్కుతోపాటు గండాలయ స్వామి కొండను, శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామి కొండను అభివృద్ధి చేసి మంగళగిరిని పర్యాటక నగరిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. ఆదివారం ఉదయం ఆయన నడక మార్గం ద్వారా గండాలయ స్వామి కొండకు చేరుకుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మార్గమధ్యలో కొండపై అటవీశాఖ అధికారులు చేపట్టిన ట్రెక్కింగ్ మార్గంతోపాటు దాతలు చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతలో రాజీ పడకుండా పర్యాటకులు, భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. కొత్తగా అవతరించిన మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఆహ్లాదంతోపాటు ఆరోగ్యాన్ని అందించేలా టెంపుల్ హిల్ ఎకో పార్క్‌ను తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత కాలంలో ఎంతో ఒత్తిడికి లోనవుతున్న ప్రజలు వ్యాయామం, నడకతో ఆరోగ్యాన్ని పెంచుకునేలా ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేలా కృషి చేస్తున్న అటవీశాఖ అధికారులను అభినందించారు. మంగళగిరి పానకాల లక్ష్మీ నృసింహ స్వామి ఎంతో ప్రసిద్ధికెక్కినా భక్తులు, పర్యాటకులు గిరిని చూడలేకపోతున్నారని, గిరిని అభివృద్ధి చేస్తామని వివరించారు. ట్రెక్కింగ్ మార్గాన్ని ప్రతిఒక్కరూ సందర్శించాలని, సాధారణంగా ట్రెక్కింగ్ అంటే యువత మాత్రమే చేస్తుందనే అపోహ ఉందని, కానీ ఇక్కడ వృద్ధులూ చేసేలా ట్రెక్కింగ్ ఏర్పాట్లు జరిగాయని వివరించారు. గండాలయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు, పర్యాటకులకు ట్రెక్కింగ్ మార్గం కూడా ఎంతో అనువైనదన్నారు.

20 హెక్టార్లలో టెంపుల్ హిల్ ఎకో పార్కు

అటవీశాఖ జిల్లా అధికారి మహబూబ్ బాషా మాట్లాడుతూ మంగళగిరి ప్రాంతంలో 20 హెక్టార్లలో టెంపుల్ హిల్ ఎకో పార్కు అభివృద్ధి చేశామన్నారు. వాకింగ్ ట్రాక్‌తో పాటు పిల్లలు ఆడుకునేందుకు ఆటవస్తువులు, ఓపెన్ జిమ్, ట్రెక్కింగ్ ట్రాక్ అభివృద్ధి చేసినట్టు వివరించారు. పార్కుతోపాటు ట్రెక్కింగ్ ట్రాక్‌లో మౌలిక వసతులు కల్పించి నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించడమే లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, పార్టీ పట్టణ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, తోట శ్రీను, మేకా వెంకట్రామిరెడ్డి, దేవస్థాన ఈఓ ఎ.రామకోటిరెడ్డితో పాటు అటవీ అధికారులు పాల్గొన్నారు.

శివయ్యకు బ్రహ్మారథం





రథోత్సవానికి హాజరైన భక్తజన సందోహం (ఇన్‌సెట్) గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి

మంగళగిరి: నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం (శివాలయం)లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. శనివారం రాత్రి స్వామి కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామి దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షించి పులకించారు. ఆదివారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రారంభిచారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు స్వామి దివ్య రథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి టెంకాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు భారీగా తరలిరావడంతో నగర వీధులు కిటకిటలాడాయి. ఓం నమశ్శివాయః నినాదంతో మార్మోగాయి. రథోత్సవం శివాలయం వద్ద బయలుదేరి మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు అందుకుని తర్వాత సీతారామ కోవెల వరకు వెళ్లి తిరిగి ఆలయానికి చేరుకుంది. దారి పొడవునా భక్తులు స్వామికి టెంకాయలు కొట్టి హారతులు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

కార్యక్రమాలను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ పాల్గొన్నారు. డీఎస్పీ జె.రాంబాబు ఆధ్వర్యంలో పట్టణ సీఐ బి.అంకమ్మరావు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటి నంబర్ లేకుండానే రశీదు



ఇంటి నంబరును వేయకుండా ఇచ్చిన బిల్లు

ఫిరంగిపురం: ఇంటిపన్ను రశీదు ఇచ్చేక్రమంలో ఫిరంగిపురం పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ ముందస్తుగా నోటీసులు అందజేయాల్సి ఉండగా కొందరికి ఇచ్చి ఇంకొందరికి ఇవ్వడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పన్ను చెల్లించిన తరువాత రశీదులో ఇంటి యజమాని పేరు, నంబరు, అస్సెస్‌మెంట్ నంబర్‌లను నమోదు చేయాలి. వీటితోపాటు పన్నుల వివరాలు స్పష్టంగా ఉండాలి. కానీ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఇంటి నంబర్‌ను వేయకుండానే రశీదు ఇస్తుండటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నంబర్ వేయలేదని అడిగితే కార్యాలయానికి వెళితే అక్కడ రాస్తారనే సమాధానం చెబుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నంబర్ లేకుండా పన్ను రశీదు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రెండేళ్లుగా ఇంటి నంబర్ వేయకుండానే రశీదులు ఇచ్చారని చెబుతున్నారు. దీనిపై పంచాయతీ ఈవో శ్రీనివాసరావును వివరణ కోరగా ఇంటి నంబర్ వేయకుండా రశీదు ఇవ్వడం తప్పేనని సిబ్బందికి చెప్పి నంబర్ వేసేలా చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

నేడు నృసింహుని బ్రహ్మోత్సవాలపై సమీక్ష

మంగళగిరి: నగరంలోని లక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై సోమవారం ఆలయ ఆవరణలో సమీక్ష నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి మార్చి 9 వరకు జరగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై నిర్వహించనున్న సమావేశానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

తపాలా శాఖలో డిపాజిట్లపై వడ్డీ రేట్ల పెంపు

మంగళగిరి: తపాలా శాఖలో డిపాజిట్లపై వడ్డీ రేట్లు గణనీయంగా పెంచినట్లు మంగళగిరి పోస్టల్ హెడ్ మాస్టర్ నరసింహారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సిటిజన్ సేవింగ్స్‌కు 8 శాతం, సుకన్య సమృద్ధి ఖాతాకు 7.6 శాతం, కిసాన్ వికాస్ పత్రాలకు 7.2 శాతం, నెలసరి ఆదాయ పథకం ఖాతాకు 7.1 శాతం, జాతీయ పొదుపు సర్టిఫికెట్ ఖాతాకు 7 శాతం, ఒక సంవత్సరం డిపాజిట్‌కు 6.6 శాతం, రెండు సంవత్సరాల డిపాజిట్‌కు 6.8 శాతం, మూడు సంవత్సరాల డిపాజిట్‌కు 6.9 శాతం, ఐదు సంవత్సరాల డిపాజిట్‌కు 7 శాతం, నెలవారీ రికరింగ్ డిపాజిట్‌కు 5.8 శాతం, సాధారణ సేవింగ్స్ ఖాతాలకు 4 శాతం వడ్డీ రేట్లను పెంచినట్టు వివరించారు.

పోటీ పరీక్షలతో వెలుగులోకి ప్రతిభ



పరీక్ష ఓఎంఆర్ షీట్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మేడికొండూరు: పోటీ పరీక్షల నిర్వహణతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని యాపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ మోరపాకుల అజయ్ కుమార్ చెప్పారు. పేరేచర్ల సత్తెనపల్లి రోడ్డులోని యాపిల్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం 9వ రాష్ట్ర స్థాయి ఈ-అభ్యాస్ కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ జరిగింది. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ కావాలని సూచించారు. ఈ పరీక్షకు 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏడు కేంద్రాలలో ఈ పరీక్ష జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ-అభ్యాస్ ఫౌండర్ సీఈఓ డాక్టర్ ఫణిపవన్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 23న గుంటూరు శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో వివిధ స్కూళ్ల చైర్మన్‌లు, ప్రిన్సిపల్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ

తాడికొండ: మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లో కొత్తగా ఎంపికైన జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ అదనపు సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పేరేచర్ల షిరిడీ సాయి కృష్ణ కల్యాణ మండపంలో, మధ్యాహ్నం 2 గంటలకు ఫిరంగిపురం సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ కార్యక్రమాలు జరగనున్నాయని వివరించారు. కార్యక్రమానికి వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతోపాటు ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ హోదాలలో ఉన్న చైర్మన్లు, అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చిరస్మరణీయుడు ఛత్రపతి శివాజీ



శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తెనాలి అర్బన్: మొగల్ పాలకులపై వీరోచితంగా పోరాడి భారతదేశాన్ని రక్షించిన మహనీయుడు ఛత్రపతి శివాజీ అని కడియాల సునీల్‌కుమార్ కొనియాడారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని శివశక్తి, బీజేపీ యువ మోర్చా సంయుక్త ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లోని ఆయన విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మైలా హరికృష్ణ, కె.వి.సుబ్బారావు, చేతుల వెంకట్రావు, కడలి కుమార్, దాసరి వెంకటనాగరాజు, నందికంటి రామాంజనేయులు, మాతూరి లక్ష్మీనారాయణ, తరుణ్ గోపి, జగదీష్, కుర్రా శివ, ధూళ్ల భరత్, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివరామిరెడ్డి

తెనాలి టౌన్: రూరల్ మండలం కంచర్లపాలెంలో తెనాలికి చెందిన భీష్మ ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోపల్లె మణెమ్మ ప్రారంభించారు. శిబిరంలో వైద్యశాల డాక్టర్ కె.శివరామిరెడ్డి సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. శుక్లాలు ఉన్నవారికి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మణెమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వినయ్‌బాబు, వైద్యశాల నిర్వాహకులు బండ్లమూడి రాజేష్, జ్యోతి, మల్లీశ్వరి, సురేంద్ర, వైఎస్సార్ సీపీ నాయకులు కోపల్లె సురేష్, కఠెవరపు శివయ్య, రాజేష్, ప్రకాష్, జయశేఖర్, నరసింహారావు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశాన్ని శక్తివంతం చేసేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి

పాత గుంటూరు: భారతదేశాన్ని అన్ని రంగాల్లో శక్తిశాలిగా చేసి సుసంపన్నంగా చేయడానికి స్వయం సేవక సంఘ్ నిరంతరం కృషి చేస్తోందని ముఖ్య వక్త, ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు తెలిపారు. హిందూ కళాశాల వెనుక సారిక మైదానంలో ఆదివారం రాష్ట్ర స్వయం సేవక్ సంఘ్, నగర సాంఘిక్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బయ్యా వాసు మాట్లాడుతూ సంఘం ప్రారంభమై వంద ఏళ్లకు చేరువవుతున్న తరుణంలో నగరంలోని స్వయం సేవకులు దేశసేవకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర సంఘ చాలక్ డాక్టర్ ఆళ్ల శ్రీకాంత్ రెడ్డి, పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో బీజేపీ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభాని

తెనాలి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విద్యార్థి సంఘాల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాల్ని భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, విమానం, బ్యాంకింగ్ వంటి రంగాలను కూడా ప్రైవేటు పరం చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. విశాఖ ఉక్కును కూడా ప్రైవేటు పరం చేసేందుకు కేంద్రం ముందడుగు వేస్తుందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు మానుకోవాలని హితువు పలికారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ మెగా డీఎస్సీని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ తెనాలి నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.కొండబాబు, పల్నాటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా నాగేంద్ర, కె.గోపి, సహాయ కార్యదర్శిగా పి.భానుచందర్, కోశాధికారిగా పి.ఆశోక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంగాల చైతన్య, షేక్ వలి, సీపీఐ ఏరియా కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు రవివర్మకు సన్మానం



రవివర్మ తదితరులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో ఆదివారం సాయంత్రం చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్టీఆర్ సమ సమాజ దృష్టి అనే అంశంపై వెంపటి సత్యనారాయణ, కొల్లూరు బసవయ్య ప్రసంగించారు. అనంతరం వక్తలతో పాటు ప్రముఖ రంగస్థల కళాకారుడు యడ్ల రవివర్మను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, మాదల కోటేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, ఉమ్మలనేని ధర్మారావు, దేవిశెట్టి భాస్కర్, బడుగు మోహనరావు, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, గరికపాటి సుబ్బారావు, హృదయరాజు, నల్లూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న దుర్గాప్రసాద్

తెనాలి టౌన్: ఏటా శివరాత్రి పురస్కరించుకుని పేద వృద్ధులకు దుస్తులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయడం అభినందనీయమని రేమిణిశెట్టి దుర్గాప్రసాద్(అమెరికా) పేర్కొన్నారు. రూరల్ మండలం ఖాజీపేటలోని శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం కమిటీ చైర్మన్ రాచర్ల సాంబయ్య ఆధ్వర్యంలో పలు కార్యక్రమాల్ని నిర్వహించారు. తొలుతగా దేవస్థానంలో దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు, ఎస్.వి.ట్రేడింగ్ కంపెనీ నిర్వాహకులు శనగపల్లి వెంకటేశ్వరరావు (హైదరాబాద్), సాంబయ్య కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అర్చకులు కొండ కావూరి నాగలింగశర్మ పూజలు జరిపారు. అనంతరం దేవస్థానం ఆవరణలో కమిటీ చైర్మన్ రాచర్ల సాంబయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పేద వృద్ధులు 49 మందికి, మహిళలు, 15 మంది పురుషులకు నూతన దుస్తుల్ని దుర్గాప్రసాద్, వెంకటేశ్వరరావు అందజేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల్ని పంపిణీ చేశారు. అనంతరం దుర్గాప్రసాద్ భక్తులకు అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పొత్తూరి నాగేశ్వరరావు, రెడ్డి శివరామకృష్ణ, అంకిరెడ్డి సీతారామయ్య, పోతాబత్తుని మోహనరావు, రాచర్ల సత్యనారాయణ, జానార్దనరావు, పాండురంగరావు, పసుపులేటి వెంకట్రావు పాల్గొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు ఉత్సవమూర్తుల్ని గ్రామంలో ఊరేగించారు.

పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి



యడ్లపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి అర్బన్: సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉంటూ పదవులకే వన్నె తెచ్చిన వ్యక్తి యడ్లపాటి వెంకట్రావు అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. రాజ్యసభ మాజీ సభ్యుడు యడ్లపాటి వెంకట్రావు ప్రథమ వర్ధంతిని గాంధీనగర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించారు. పలువురు యడ్లపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యడ్లపాటి జీవితం యువ రాజకీయ నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా, రాజ్యసభ సభ్యుడిగా యడ్లపాటి చేసిన అభివృద్ధి మరువరానిదని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, బాపట్ల అర్బన్ డెవలెప్‌మెంట్ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, టుబాకో బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథబాబు, జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ముమ్మనేని వెంకటసుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోనినేని ఉమ, పలువురు టీడీపీ, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రముఖులు ఉన్నారు.

సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన



పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న విద్యార్థులు

తెనాలి టౌన్: సద్గురు త్యాగరాజస్వామి ఆరాధనలో భాగంగా శ్రీలక్ష్మీ శారదా సంగీత ఆలయం విద్యార్థులు బోసు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం పంచరత్న, ఉపచార కీర్తనలు ఆలపించారు. తొలుతగా సంగీత గురువులు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి ఇంటి నుంచి నగర సంకీర్తనలు ఆలపిస్తూ వాసవీ ఆలయానికి చేరుకున్నారు. త్యాగరాజస్వామి విరచిత ఘన రాగాల్ని విద్యార్థులు ఆలపించారు. గత 35 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంజనేయశాస్త్రి తెలిపారు. తీర్థప్రసాదాలు వితరణ చేశారు. మృదంగంపై వెంకట రామకృష్ణ, వైలెన్‌పై శ్రీకృష్ణ అభిరామ్, ఆంజనేయశాస్త్రి సహకరించగా, కొండపి శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్తీక్, సౌజన్య, కుమార శ్యామ్‌కృష్ణ శర్మ, అరుణ, వల్లి పాల్గొన్నారు.